

ఖరీదైన మార్బుల్స్‌తో ఉన్న ఓ గది



కర్నూలు ఫైవ్ రోడ్స్ జంక్షన్‌లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న రెండు అంతస్తుల్లో వైసీపీ కార్యాలయం

కర్నూలులో వైసీపీ ప్యాలెస్

- రూ.వంద కోట్లకు పైగా విలువైన స్థలంలో పార్టీ కార్యాలయం
- కుడా, కార్పొరేషన్ అనుమతులు లేని అక్రమ నిర్మాణం
- ఏడాదైనా పట్టించుకోని టౌన్ ప్లానింగ్ యంత్రాంగం
- లీజు పేరిట కారుచౌకగా కొట్టేసిన వైనం

అధికారం ఉంటే చాలు.. ఎక్కడి భూములైనా కొట్టేయవచ్చు..ప్రజల సంపదను సొంతం చేసుకోవచ్చు..ఈ సంగతి గత వైసీపీ పాలనలో అడుగడుగునా రుజువైంది. రాజకోటను మించిన రుషికొండ ప్యాలెస్ విశాఖలోనే లేదు. మన కర్నూలులో కూడా రైల్వే స్టేషన్ ఐదు రోడ్ల కూడలికి వెళితే నిర్మాణంలో ఉన్న రాజప్రాసాదం కనిపిస్తుంది. దీని పేరు వైసీపీ జిల్లా కార్యాలయం. ఏపీ ఆగ్రోస్‌కు చెందిన రూ. వంద కోట్లకు మించిన విలువైన స్థలాన్ని వైసీపీ కబ్జా చేసింది. అధికారం ఉంది కాబట్టి రాష్ట్రమంతా సొంత జాగీరుగా ఆ పార్టీ భావించింది. దీనికి ఇదే ఉదాహరణ. ఈ నిర్మాణానికి కుడా లేదా నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అప్రూవల్ లేదు. నిబంధనలన్నిటినీ తుంగలో తొక్కేశారు. ఏడాదిగా ఈ అక్రమ నిర్మాణం సాగుతోంది. అధికారులు అటువైపు వెళ్లలేదు. ఈ స్థలాన్ని మేము లీజుకు తీసుకున్నాం.. వైసీపీ అక్రమ నిర్మాణాన్ని ఆపండి.. అంటూ కలెక్టరుకు వంశీ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. అప్రూవల్ కోసం మంగళవారం దరఖాస్తు వచ్చిందని కుడా అధికారులు పేర్కొన్నారు.

కర్నూలు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి):

కర్నూలు నగరం నడిబొడ్డున, వాణిజ్యపరంగా దినదినాభివృద్ధి చెందుతున్న రైల్వే స్టేషన్ రోడ్డు ఐదు రోడ్ల కూడలిలో జలవనరుల శాఖకు చెందిన సర్వే నంబరు 95-2లో 3.40 ఎకరాలు ఉంది. అందులో 1.60 ఎకరాలు ఏపీ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ ఆగ్రోస్ సంస్థ)కు 1979లో ఆనాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 661 జారీ చేసింది. రైతుకు శిక్షణ కేంద్రం కోసం ఆగ్రోస్‌కు ఈ స్థలాన్ని కేటాయించారు. 2014-15లో ఆర్ఎస్ రోడ్డు నుంచి కల్లూరు ఎస్టేట్‌లోని గోదాముకు ఏపీ ఆగ్రోస్ సంస్థను మార్చారు. ఆనాటి నుంచి నుంచి ఈ స్థలం ఖాళీగా ఉంది. ఏపీ ఆగ్రోస్ సంస్థ ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. ఖాళీగా ఉన్న ఈ స్థలంపై పలువురు రాజకీయ నాయకులు కన్నేశారు. 2010 నుంచి ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో మా స్థలం తిరిగి మాకే ఇవ్వండని జల వనరుల శాఖ సీఈ కబీర్‌బాషా ఏపీ ఆగ్రోస్ సంస్థకు పలుదఫాలుగా లేఖలు రాశారు. రెండు ప్రభుత్వ శాఖల మధ్య వివాదం నడుస్తూనే ఉంది.

లీజు పేరిట కారుచౌకగా కొట్టేశారు

రైల్వే స్టేషన్ ఐదు రోడ్ల కూడలిలో సెంటు స్థలం బహిరంగ మార్కెట్‌లో రూ.50-75 లక్షలకు పైగానే పలుకుతోందని ఓ బిల్డర్ పేర్కొన్నారు. ఈ లెక్కన 1.60 ఎకరాల భూమి విలువ రూ.100 కోట్లకు పైనే ఉంటుంది. ఎంతో విలువైన ఈ భూమిపై వైసీపీ ముఖ్య నాయకుల కన్ను పడింది. వైసీపీ కార్యాలయం నిర్మాణం కోసం గుట్టు చప్పుడు కాకుండా జగన్ ప్రభుత్వానికి లేఖ రాశారు. అధికారం ఉంది.. కనుసైగ చేస్తే అక్రమంగా అయినా సరే పనులు చేసిపెట్టే అధికారులు ఉన్నారు. ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించాల్సిన రూ.కోట్ల విలువైన ఏపీ ఆగ్రోస్ సంస్థకు చెందిన ప్రభుత్వ భూమిని ఏడాదికి రూ.1,600 ప్రకారం లీజు చెల్లించేలా 33 ఏళ్లకు వైసీపీ కార్యాలయం కోసం కేటాయిస్తూ 2023 ఫిబ్రవరి 16న ఆనాటి జగన్ ప్రభుత్వం జీవో నంబరు-55 జారీ చేసింది. ఈ జీవోను కూడా ఎంతో గోప్యంగా ఉంచారు. ప్రజలు, రైతుల ప్రయోజనాలను విస్మరించి నగర నడిబొడ్డున ఉన్న 1.60 ఎకరాలు ప్రభుత్వ భూమిని లీజు పేరిట కారుచౌకగా వైసీపీ కార్యాలయం కోసం కట్టబెట్టడంపై అప్పట్లో పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణం:

2023 జూలైలో కర్నూలు నగరపాలక సంస్థ, కుడా నుంచి అనుమతులు లేకుండా వైసీపీ కార్యాలయం నిర్మాణాన్ని ప్రారంభించారు. నిబంధనల ప్రకారం వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్, ప్రభుత్వం నిర్దేశించిన రుసుం చెల్లించి టౌన్ ప్లానింగ్ అప్రూవల్ వచ్చిన తరువాతే పనులు చేపట్టాలి. ఈ నిబంధనలకు విరుద్ధంగా సువిశాలమైన రెండు అంతస్తులతో రుషికొండ ప్యాలెస్ రాజకోట నిర్మాణం చేపట్టారు. ఆఫీసు రూములు, సమావేశం హాల్ వంటి ప్రత్యేక ఏర్పాట్లతో భవన నిర్మాణం దాదాపుగా పూర్తయ్యింది. ఫ్లోరింగ్, రంగులు, ఇంటీరియల్ డెకరేషన్.. చేయాల్సి ఉంది. కలెక్టరు, కార్పొరేషన్ కమిషనర్, కుడా వైస్ ఛైర్మన్.. వంటి జిల్లా స్థాయి ఉన్నతాధికారులు ఆ రోడ్డు మీదుగా ఎన్నోసార్లు వెళ్లి ఉంటారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ రోడ్డు పక్క నుంచి విధులకు వెళ్తుంటారు. వైసీపీ ఆఫీసు వైపు మాత్రం కన్నెత్తి చూడలేదు. టౌన్ ప్లానింగ్ అప్రూవల్ ఉందా..? కనీసం దరఖాస్తయినా చేశారా..? అని కూడా పరిశీలించలేదు. ఈ విషయాన్ని కూడా అధికారుల దృష్టికి తీసుకెళితే ఈ రోజే (మంగళవారం) అప్రూవల్ కోసం దరఖాస్తు వచ్చిందని పేర్కొన్నారు.







వివిధ గదుల నిర్మాణం



రైల్వే స్టేషన్ ఐదు రోడ్ల కూడలిలో ఆగ్రోస్ స్థలంలో చేపట్టిన వైసీపీ ఆఫీసు నిర్మాణం. 2023 ఆగస్టు 5 నాటికే ఇదిగో ఇలా పునాదులు పిల్లర్లు వేసేందుకు సిద్ధం చేసిన ఇనుప కడ్డీలు (ఫైల్)

కలెక్టరుకు ఫిర్యాదు

ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో ఆగ్రో ట్రేడ్ సెంటర్‌ను అభివృద్ధి చేసేందుకు ఏపీ ఆగ్రోస్ సంస్థ నుంచి 2012లో లీజుకు తీసుకున్నామని ఎస్వీ ఇంజనీరింగ్ కన్‌స్ట్రక్షన్‌కు చెందిన ఆగ్రో ట్రేడ్ సెంటర్ (కర్నూలు) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు పేర్కొంటున్నారు. లెటర్ ఆఫ్ ఇండెంట్ (ఎల్ఓఐ) షరతులు పాటిస్తూనే ముందస్తు లీజు చెల్లించామని అంటున్నారు. వివిధ కారణాలు వల్ల ప్రాజెక్టు ఆగిపోయిందని, ఆ వివరాలు ఆగ్రో సంస్థకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామని అంటున్నారు. తమకు ఇచ్చిన లీజు గడువు ఉండగానే ఆ భూమిని వైసీపీ కార్యాలయం నిర్మాణం కోసం కేటాయించారని, ఇది చట్ట విరుద్ధమని, వైసీపీ కార్యాలయాన్ని తొలగించి తాము చేపట్టే ప్రాజెక్టు అభివృద్ధికి సహకరించాలని కోరుతూ ఆ సంస్థ డైరెక్టర్లలో ఒకరైన శ్రీనివాస్ బందోజి ఈ నెల 6న కలెక్టరు డాక్టర్ జి.సృజనకు ఫిర్యాదు చేశారు.



వైసీపీ ఆఫీసు భవనం లోపలి భాగం నిర్మాణాలు



అప్రూవల్ కోసం దరఖాస్తు వచ్చింది...

వైసీపీ కార్యాలయం నిర్మాణానికి అప్రూవల్ కోరుతూ ఈ రోజే దరఖాస్తు వచ్చిందని, బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని కుడా వైస్ ఛైర్మన్ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ విషయాన్ని కర్నూలు కార్పొరేషన్ కమిషనర్ భార్గవ్‌తేజ దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా అప్రూవల్ కోసం దరఖాస్తు వచ్చిందని, అనుమతులు ఇచ్చాక పనులు చేపడుతారని పేర్కొన్నారు. ఇప్పటికే పనులు నడుస్తున్న నిర్మాణం విషయంలో ఇదేమి వివరణ అని ప్రశ్నిస్తే సరైన సమాధానం లేదు.

రైతుల ఖాతాకు పీఎం కిసాన్ సాయం

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 18 : రైతులకు పెట్టుబడి ఖర్చు కింద కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద ఆర్థిక సాయాన్ని మంగళవారం అందించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో రైతుల బ్యాంకు ఖాతాలకు ఒక్కొక్కరికి రూ.2వేల ప్రకారం జమ చేశారు. కర్నూలు జిల్లాలో 2.34 లక్షల మంది రైతులకు రూ.46.97 కోట్లు, అదే విదంగా నంద్యాల జిల్లాలో 1.95 లక్షల మంది రైతులకు రూ.39.19 కోట్లు అందించారు. ఉమ్మడి జిల్లాకు 4,29,029 మంది రైతులకు రూ.86.97 కోట్లును అందించారని వ్యవసాయ శాఖ కర్నూలు జేడీ వరలక్ష్మి తెలిపారు.



నీటి ట్యాంకులను శుభ్రం చేయండి: డీపీఓ

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 18: కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి మంచినీటి సరఫరా ట్యాంకును పరిశుభ్రం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ, నగరంలోని మంచి నీటి సరఫరా ట్యాంకులను ప్రతి నెలా రెండుసార్లు పరిశుభ్రం చేయాలన్నారు. ట్యాంకులను పరిశుభ్రం చేయని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆకాశంలోకి ఉల్లి ధర

- క్వింటం రూ.1,835
- సంతోషంలో రైతులు



కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 18 : ఉల్లిగడ్డల ధరలు మళ్లీ ఆకాశానికి ఎగబాకుతున్నాయి. మంగళవారం కర్నూలు నగరంలోని మార్కెట్ యార్డులో రైతులు విక్రయానికి తెచ్చిన ఉల్లి ధరలు క్వింటంపై గరిష్ఠ, మధ్యస్థ ధరలు రూ.1,835, కనిష్ఠ ధర రూ.1401గా నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు, అదనపు సెక్రటరీలు వెంకటేశ్, రెహిమాన్ తెలిపారు. అదే విధంగా కందుల ధరలు కూడా పెరుగుతున్నాయని, గరిష్ఠ ధర క్వింటం రూ.11,251 నమోదైందని, కనిష్ఠ ధర రూ.2,052 ఉందని తెలిపారు. శనగలు గరిష్ఠ ధర, కనిష్ఠ ధర రూ.6,709 రైతులకు లభించిందని, ఎండుమిర్చి క్వింటం గరిష్ఠ ధర రూ.9,449, కనిష్ఠ ధర రూ.6,599 అని సెక్రటరీ గోవిందు తెలిపారు. వేరుశనగ కాయలకు గరిష్ఠ ధర రూ.7,100, మధ్యస్థ ధర రూ.6,069, కనిష్ఠ ధర రూ.2,882 రైతులకు అందినట్లు ఆయన తెలిపారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు



కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 18: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. కర్నూలు జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ కోర్సులో మొత్తం విద్యార్థులు 6,008 మంది పరీక్షకు హాజరు కాగా, 3,314 మంది పాసయ్యారు. 52 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అలాగే ఒకేషనల్ కోర్సులో 712 మందికి గాను 319 మంది పాసై 45 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనరల్ కోర్సులో 1776 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 1010 మంది పాసై 56.87 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 19 మందికి గాను 13 మంది పాసై 68.42 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో 196 మంది పరీక్షకు హాజరు కాగా, 68 మంది పాసయ్యారు. 34.69 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 127 మందికి గాను 81 మంది పాసై 63.78 శాతం ఉత్తీర్ణత సాధించారు. బీసీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 7 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, అందరు పాసై వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటెన్సివ్ జూనియర్ కళాశాలలో 55 మందికి గాను 35 మంది పాసై 63.34 శాతం ఉత్తీర్ణత సాధించారు. కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో 131 మందికి గాను 70 మందిపాసై 51.09 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో రెండు జూనియర్ కళాశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా.. మరో రెండు జూనియర్ కళాశాలల్లో జీరో ఉత్తీర్ణత శాతం వచ్చాయి. ఆదర్శ పాఠశాలల్లో 693 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 407 మంది పాసై 58.73 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేటు అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో 2683 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 1338 మంది ఉత్తీర్ణులై 49.87 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేటు కాంపోజిట్ జూనియర్ కళాశాలలో 315 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 85 మంది పాసై 26.98 శాతం ఉత్తీర్ణత సాధించారు.

నంద్యాల జిల్లాలో విస్తారంగా వర్షాలు



చెరువును తలపిస్తున్న ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాల ఆవరణ

నంద్యాల టౌన్, జూన్ 18 : బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావంతో జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు విస్తారంగా వర్షాలు కురిశాయి. ఉయ్యాలవాడ మండలంలో అత్యధికంగా 109.6 మిల్లీమీటర్ల వర్షం కురువగా, ఆళ్లగడ్డలో 102.2, రుద్రవరంలో 100.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా సరాసరి 18.2 మి.మీ వర్షం కురిసింది. చాగలమర్రి మండలంలోని కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాల సమీపంలోని వక్కిలేరు ఉధృతంగా ప్రవహించింది. ఉయ్యాలవాడ మండలంలో కుందవాగు వంతెనపై వరద ప్రవహించి ఆళ్లగడ్డ-ఉయ్యాలవాడ గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. రుద్రవరం మండలంలోని ఎర్రగుడిదిన్నెలో పిడుగుపాటుకు ఐదు మూగజీవాలు మృతి చెందాయి. చాగలమర్రి మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామ సమీపంలోని వక్కిలేరు వంతెనపై వరద ఉప్పొంగింది. ఈ గ్రామానికి చెందిన అగస్టిన్ (50) కడప నిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు వాహనంలో తీసుకొచ్చారు. గ్రామ సమీపంలోకి రాగానే వక్కిలేరుపై వరద భారీగా ప్రవహిస్తోంది. ఇక చేసేది లేక మృతదేహాన్ని మంచం మీద ఒడ్డుకు చేర్చారు.

నగర పాలక సంస్థ కార్యాలయంలో బదిలీలు

- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), జూన్ 18: నగర పాలక సంస్థ కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్లను బదిలీ చేస్తూ కమిషనర్ భార్గవ్‌తేజ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సీనియర్ అసిస్టెంట్ వీఎం శ్రీకాంత్‌ను మెయిన్ సెక్షన్‌లో సీ-3 క్లర్క్‌గా అక్కడ పని చేస్తున్న శివశంకర్‌ను పబ్లిక్ హెల్త్ సెక్షన్ సీ-3 క్లర్క్‌గా, పబ్లిక్ హెల్త్ సెక్షన్‌లో పని చేస్తున్న ఎం.రాజును టౌన్ ప్లాన్ సెక్షన్‌లో జీ-1 క్లర్క్‌గా బదిలీ చేశారు. అదేవిధంగా టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో సూపరింటెండెంట్ వి.సుబ్బన్నను అదే సెక్షన్‌లో పని చేస్తున్న పి.కిష్టఫర్‌బాబు ప్లేస్‌కు, పి.కిష్టఫర్‌బాబును రెవెన్యూ సెక్షన్‌కు బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్ పి.సాదిక్ హుసేన్‌ను రెవెన్యూ సెక్షన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాటు రెవెన్యూ సెక్షన్‌లో పని చేస్తున్న సూపరింటెండెంట్ పీఎస్ రాజేశ్వరరావును ఇంజనీరింగ్ సెక్షన్‌కు, ఖాళీగా ఉన్న రెవెన్యూ ఆఫీసర్ పోస్టుకు మేనేజర్ చిన్నరాముడుకు ఇన్‌చార్జిగా నియమిస్తూ నగరపాలక సంస్థ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం బదిలీలను చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

నామ మాత్రమేనా..?



కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 18:

గత రబీలో వర్షాభావం వల్ల ఉమ్మడి జిల్లా రైతులు పూర్తిగా నష్టపోయారు. అధికార యంత్రాంగం 1,30,189 హెక్టార్లలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో పంటలు దెబ్బతిన్నాయని, 1,16,912 మంది రైతులు నష్టపోయారని, వారికి రూ.128.87 కోట్ల నష్టపరిహారాన్ని అందించాలని అంచనా వేసింది. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వంలో ఈ మొత్తంలో దారుణమైన కోత పెట్టి నష్టపరిహారాన్ని రూ.96 కోట్లకు పరిమితం చేసింది. ఈ పరిహారాన్ని అందజేసేందు కోసం కేంద్ర ప్రభుత్వం కరువు బృందాన్ని రాష్ట్రానికి పంపిస్తోంది. 10 మంది వివిధ విభాగాలకు చెందిన అధికారులు మూడు టీములుగా ఏర్పడి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కరువు పరిస్థితులను మంగళవారం నుంచి పరిశీలించనున్నారు. అయితే కేంద్ర బృందం ఎంత వరకు వాస్తవ పరిస్థితులు పరిశీలించేదీ వేచి చూడాలి.

- ఉమ్మడి జిల్లాలోని ఆరు గ్రామాల్లోనే కరువు బృందం పర్యటన..
- కొద్ది మంది రైతుల ముఖాముఖితో మమ
- కేంద్ర కరువు బృందాన్ని నిలదీస్తామంటున్న రైతు సంఘాల నేతలు
- నిబంధనలను పక్కన పెట్టి అందరికీ న్యాయం చేయాలని డిమాండ్
- నేటి నుంచి రెండు రోజుల పాటు కేంద్ర కరువు బృందం పరిశీలన

6 మండలాల పరిధిలోనే పరిశీలన

ఉమ్మడి జిల్లాలోని 54 మండలాల్లో కరువు పరిస్థితులు ఉంటే కరువు తీవ్రత కేవలం 31 మండలాల్లోనే కనిపిస్తోందని, జిల్లా అధికార యంత్రాంగం నివేదికను తయారు చేసింది. ఆ మేరకైనా పరిహారం ఇస్తారేమో అని రైతులు ఆశ పెట్టుకున్నారు. కానీ కేంద్ర కరువు బృందం నేటి నుంచి కర్నూలు జిల్లాలో ఆలూరు, కోడుమూరు, కర్నూలు మండలాల్లో, నంద్యాల జిల్లాలో కోవెలకుంట్ల, దొర్నిపాడు, నంద్యాల మండలాల్లో మాత్రమే పర్యటించనున్నారు.

నష్టపోయింది 1.16 లక్షల మంది రైతులు.. పరిహారం కేవలం రూ.96 కోట్లే..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత రబీలో దాదాపు 3 లక్షల మంది రైతులు మూడున్నర లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేసి మొత్తం నష్టపోయారు. అయితే.. ఉమ్మడి జిల్లా వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖల అధికారులు కేవలం 1,16,912 మంది రైతులు మాత్రమే, 1,30,189 లక్షల హెక్టార్లలో పంట నష్టపోయారని, వారికి రూ.128.89 కోట్ల పరిహారాన్ని ఇవ్వాలని నివేదికలు తయారు చేశారు. అయితే ఈ మొత్తాన్ని ప్రభుత్వం రూ.96 కోట్లకే పరిమితం చేసింది. వాస్తవ కరువు పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి 33 శాతం కంటే తక్కువ పంట నష్టం జరిగినా పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.



ఉమ్మడి జిల్లాలో గత రబీలో పంట నష్టపోయిన మండలాలు ఇవే

- కర్నూలు జిల్లాలో కర్నూలు రూరల్, ఓర్వకల్లు, కోడుమూరు, కల్లూరు, గూడూరు, ఆదోని, మంత్రాలయం, ఆలూరు, చిప్పగిరి, ఆస్పరి, హోళగుంద, హాలహర్వి, పత్తికొండ, తుగ్గలి మద్దికెర, వెల్దుర్తి, సి.బెళగల్ మండలాలు.
- నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డ, దొర్నిపాడు, నంద్యాల, నందికొట్కూరు, అవుకు, కోవెలకుంట్ల, మిడుతూరు, సంజామల, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల, గోస్పాడు, బనగానపల్లె, గడివేముల మండలాలు .

నష్టపోయిన రైతులందరికీ పరిహారాన్ని అందించాల్సిందే



కనీసం గత రబీలో అధికారులు గుర్తించిన 31 మండలాల్లోని రైతులకైనా పరిహారం ఇవ్వాలి. లేకపోతే ఆందోళనలు చేపడుతాం.

\- జగన్నాథం, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి



పరిహారం అందించేందుకు చర్యలు



గత రబీలో పంటలు నష్టపోయిన రైతుల జాబితాను నిబంధనల మేరకు తయారు చేశాం. కరువు తీవ్రతను కేంద్ర బృందం పరిశీలించాక ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తాం.

\- వరలక్ష్మి, జేడీ. కర్నూలు

ప్రాణం తీసిన సీటు గొడవ

- కత్తితో దాడి, యువకుడి మృతి
- నంద్యాల జిల్లా ఆత్మకూరులో ఘటన



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

ఆత్మకూరు రూరల్, జూన్ 18: వాహనంలో సీటు కోసం జరిగిన గొడవ ఓ యువకుడి ప్రాణాన్ని బలిగొంది. సీటు దక్కలేదన్న కోపాన్ని మనసులో ఉంచుకున్న యువకుడు రెండు రోజుల తర్వాత మరో యువకుడిని కత్తితో హత్య చేసిన సంఘటన నంద్యాల జిల్లా ఆత్మకూరులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు మండలం కురుకుంద గ్రామానికి చెందిన ఫరూక్, కృష్ణాపురం గ్రామానికి చెందిన ముర్తుజావలి హైదరాబాదులో కోవా బన్ను వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవారు. హైదరాబాదులో వ్యాపారాన్ని ముగించుకుని ఇద్దరు ఈ నెల 16వ తేదీన కోవా బన్నును తరలించే టాటా ఏస్ వాహనంలో ఆత్మకూరుకు బయలుదేరారు. అయితే వాహనంలో డ్రైవర్ పక్కసీటులో కూర్చునే విషయంలో ఫరూక్, ముర్తుజావలి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. 17వ తేదీన వారిద్దరూ స్వగ్రామాలకు చేరుకున్నారు. అయితే ఫరూక్ అదే రోజు రాత్రి ముర్తుజావలికి ఫోన్ చేసి సీటు విషయంలో జరిగిన అంశాన్ని ప్రస్తావిస్తూ దుర్భాషలాడాడు. 'దమ్ముంటే కురుకుంద గ్రామానికి రా..' అంటూ సవాల్ విసిరాడు. సవాల్‌ను స్వీకరించిన ముర్తుజావలి స్నేహితులతో కలసి కురుకుంద గ్రామానికి వెళ్లి ఫరూక్‌తో గొడవకు దిగాడు. ముర్తుజావలి వెంట ఆత్మకూరు పట్టణానికి చెందిన షేక్ ఖాదర్‌వలి(20) కూడా వెళ్లాడు. ఘర్షణలో భాగంగా ఆవేశానికి గురైన ఫరూక్ తన వద్ద ఉన్న కోవా బన్ను కత్తితో షేక్ ఖాదర్‌వలిపై దాడి చేశాడు. అతడి ఛాతీపై పలుమార్లు పొడిచాడు. ఈ ఘటనతో కుప్పకూలిపోయిన ఖాదర్‌వలిని, ముర్తుజావలిని స్నేహితులు హుటాహుటిన ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే షేక్ ఖాదర్‌వలి మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడి తండ్రి మాలిక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా మృతి చెందిన ఖాదర్‌వలి అవివాహితుడు.



ఖాదర్‌వలి (ఫైల్)

విద్యుదాఘాతంతో మహిళ మృతి



మృతి చెందిన జైతూన్

ఓర్వకల్లు, జూన్ 18: మండలంలోని పాలకొలను గ్రామానికి చెందిన షేక్ జైతూన్ (30) విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఈ ఘటన మంగళ వా రం జరిగింది. గ్రామానికి చెందిన రాజేశ్వరమ్మ కిరాణం షాపు నిర్వహిస్తోంది. ఆమె వికలాంగురాలు రావడంతో ప్లగ్ తీయడానికి జైతూన్ సాయంగా వెళ్లి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త మా బాషా, ఒక కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలానికి తహసీల్దార్ నటరాజ్, గ్రామ టీడీపీ నాయకుడు చదువుల సుధాకర్ రెడ్డి, సర్పంచ్ చదువుల సుజా తమ్మ వెళ్లి పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

పాములపాడు, జూన్ 18 : మండలంలోని బానుముక్కల గ్రామంలో విశ్వేశ్వరరావు (25) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. కొంత కాలంగా విశ్వేశ్వరరావు కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం సాయంత్రం కడుపునొప్పి భరించలేక ఇంట్లోని బాతురూంలో ఉరివేసుకొన్నాడు. కుటుంబసభ్యులు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెఎందినట్లు తెలిపారు. తండ్రి చిన్న హనుమన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పాములపాడు ఎస్ఐ అశోక్ తెలిపారు

సహకార సంఘాల్లో సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలి

- లేకపోతే రుణాలు అందవు..
- పుల్లయ్య, సీఈవో

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 18 : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు అందించే కార్యక్రమం పెద్ద ఎత్తున జరుగుతోందని, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఉన్న రైతులు తమ సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలని ఆ సంఘం పర్సన్ ఇన్‌చార్జి నాగరమణయ్య, సంఘం సీఈవో పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని, సభ్యత్వ నమోదు కార్యక్రమం వంద శాతం యథావిధిగా కొనసాగాలంటే ప్రతి రైతు తన పొలం, పాసు పుస్తకాలు, ఆధార్, పాన్‌కార్డు జిరాక్స్ ధృవీకరణ పత్రాలను, రెండు ఫొటోలను సంఘం సిబ్బందికి అందజేయాలని కోరారు.

క్యాజువాల్టీ విస్తరణకు చర్యలు

అదనపు 15 పడకలకు పనులు ప్రారంభం



పాత ఈసీజీ రూములో విస్తరణ పనులను చేపట్టిన సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్), జూన్ 18: అత్యవసర విభాగమైన క్యాజువాలిటీ విస్తరణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. పాత ఈసీజీ, ఫార్మసీ కౌంటర్ల గదుల్లో గోడల కూల్చివేత పనులు మొదలయ్యాయి. రోగుల రద్దీ దృష్ట్యా అదనపు పడకలతో క్యాజువాల్టీకి అనుసంధానం చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఫార్మసీ కౌంటర్‌ను ఎంసీ బ్లాక్ సమీపంలో మార్పు చేయడంతో క్యాజువాల్టీ విస్తరణ పనులు వేగవంతమయ్యాయి.

అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

నంద్యాల (కల్చరల్), జూన్ 18: జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలో నిరుపేదలకు రాయితీపై ఆహారాన్ని అందించే అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి మున్సిపల్ కమిషనర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలో అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. గతంలో ఏర్పాటు చేసిన భవనాల్లో సచివాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ఉంటే, వాటిని అనువైన ప్రదేశానికి షిఫ్ట్ చేయాలని అన్నారు. అన్న క్యాంటీన్లకు అవసరమైన ఫర్నిచర్, విద్యుత్, టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు ఆర్థిక అంచనాలు సమర్పించాలని ఆదేశించారు.

12 ఎకరాలు కబ్జా

వైసీపీ నాయకులపై ఆరోపణ



రామాపురం కొండల్లో అక్రమంగా తవ్విన పొలం ఇదే

రుద్రవరం, జూన్ 18 : రుద్రవరం రెవెన్యూ పరిధిలో తువ్వపల్లె కొండల్లో ఆరు ఎకరాలు అక్రమంగా మామిడి మొక్కలు నాటి కబ్జా చేశారని, అట్లాగే టి.లింగందిన్నె రెవెన్యూ పరిధిలోని రామాపురం కొండల్లో మరో ఆరు ఎకరాలు కబ్జా చేశారని టి. లింగందిన్నె సర్పంచ్ ఎం. లక్ష్మీదేవి, టీడీపీ నాయకులు చిన్నిక్రిష్ణ మంగళవారం ఆరోపించారు. ఎలాంటి అనుమతిలేకుండా అక్రమంగా పొలాలు దున్ని మామిడి మొక్కలు నాటడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. రుద్రవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బ్రహ్మం తువ్వపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీనరసింహ అక్రమంగా కబ్జా చేసి ఒకరు పొలం దున్నితే మరొకరు మామిడి మొక్కలు నాటారని వారు విమర్శించారు. ఈ విషయంపై ఆర్. నాగలవరం గ్రామం రెవెన్యూ అధికారి పుల్లయ్య మాట్లాడుతూ ఈ పొలం విషయంలో తాము ఎలాంటి అనుమతి ఇవ్వలేదని అన్నారు.



తువ్వపల్లె కొండల్లో మామిడి మొక్కలు నాటిన పొలాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ లక్ష్మీదేవి

సిద్ధేశ్వరం ముంపు భూములపై పోరాడుతాం

టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి



మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

కొత్తపల్లి, జూన్ 18: శ్రీశైలం నీటి ముంపు నుంచి బయటపడిన భూములను సాగు చేసుకుంటున్న పేద రైతులపై ఇరిగేషన్ అధికారులు కక్షసాధింపు చర్యలు మానుకోవాలని, లేనిపక్షంలో న్యాయ పోరాటం చేస్తామని టీడీపీ సీనియర్ నాయకులు, నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం బైరెడ్డి కొత్తపల్లి మండలంలోని లలితా సంగమేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ పూర్ణకుంభం స్వాగతం పలికారు. అనంతరం బైరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సిద్ధేశ్వరం, జానాల, బలపాలతిప్ప గ్రామాల పేద రైతులు 40 ఏళ్లగా శ్రీశైలం రిజర్వాయరు నుంచి బయల్పడిన భూములను సాగు చేసుకుంటున్నారని అన్నారు. కొందరు స్థానికేతరులు ఈ భూములు కోసం వారితో తరచూ గొడవలకు దిగేవారని, గత వైసీపీ ప్రభుత్వంలో అధికారులు 144 సెక్షన్ అమలు చేయించి, ఆ భూములను ఎవరూ సాగు చేసుకోరాదని ఆంక్షలు విధించారన్నారు. అధికారులు రైతుల కడుపు కొడితే సహించేది లేదన్నారు. బైరెడ్డి సిద్ధేశ్వరం, బలపాలతిప్ప నీటి ముంపు భూములను సందర్శించేందుకు వెళ్తున్నారన్న సమాచారం తెలుసుకున్న ఆత్మకూరు సీఐ నాగభూషణ్, కొత్తపల్లి, పాములపాడు ఎస్ఐలు హరిప్రసాద్, అశోక్ ఆయనను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. బైరెడ్డి ఇరిగేషన్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో చర్చించడంతో, త్వరలోనే క్షేత్ర స్థాయిలో పరిశీలించి పేద రైతులకు న్యాయం చేస్తామని చెప్పినట్లు బైరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాకరవాడ చిన్న వెంకటస్వామి, భాస్కర్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, శివారెడ్డి, చిన్న పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ



స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు(రూరల్), జూన్ 18: కర్నూలు రూరల్ మండలం పసుపుల గ్రామంలో ప్రభుత్వ మండల ప్రజా పరిషత్ పాఠశాలలో మంగళవారం కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. వాటితో పాటు విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేసే కిట్లను కూడా అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైద్యం, విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత ప్రమాణాలు మరింత మెరుగుపరచాలని ఎమ్మెల్యే విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పది ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు రూరల్ మండల విద్యాశాఖ అధికారి వినోద్‌కుమార్, పాఠశాల ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిమ్మనదొడ్డిలో గడ్డివాములు దగ్ధం

సి.బెళగల్, జూన్ 18: మండలంలోని తిమ్మనదొడ్డి గ్రామానికి చెందిన రాముడు, పరమేష్ అనే ఇద్దరు రైతులకు చెందిన నాలుగు గడ్డివాములు ప్రమాదవశావత్తు నిప్పంటుకుని దగ్ధమయ్యాయి. ఈ విషయాన్ని కోడుమూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేయగా వారు వచ్చేలోపు గడ్డివాములన్నీ కాలి బూడిద అయినట్లు రైతులు తెలిపారు. స్థానిక రెవెన్యూ అధికారులు రైతులతో మాట్లాడి ఎంత నష్టం జరిగిందని అంచన వేశారు. దాదాపు రూ.2లక్షలు నష్టం జరిగిందని రైతులు తెలిపారు.

యోగాతోనే ఆరోగ్యం

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 18: ప్రతిరోజు విద్యార్థులు యోగా సాధన చేస్తే ఆరోగ్యంగా ఉంటారని రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ 26వ వార్డు కార్పొరేటర్ దండు లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. మంగళవారం పదో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా యోగా సంఘం, క్రీడాభారతి కర్నూలు జిల్లా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగా పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో యోగా సంఘం రాష్ట్ర కార్యదర్శి అవినాశ్‌శెట్టి, జిల్లా యోగా సంఘం ప్రతినిధులు అశోక్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శశిధర్, సురేష్, లాలనప్రియ పోటీల నిర్వహక కార్యదర్శి మునిస్వామి, శ్రీనివాసులు, జాతీయ యోగా న్యాయ నిర్ణేత షహనాజ్ బేగం పాల్గొన్నారు.





సుంకులా పరమేశ్వరికి గౌరు చరిత పూజలు

కల్లూరు, జూన్ 18: 19వ వార్డు ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయిస్ కాలనీలోని సుంకులాపరమేశ్వరీ అమ్మవారికి పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం గణేష్‌నగర్‌లోని అమ్మవారి ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక ఆహ్వానం పలికారు. అనంతరం శ్రీసుంకులాపరమేశ్వరీ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, శీను, నవీన్, శర్మ తదితరులు పాల్గొన్నారు.



గౌరు చరితకు పూల బొకే ఇస్తున్నజయరాజ్ ఇస్పాత్ కంపెనీ సీఈవో



సుంకులా పరమేశ్వరికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

● **గౌరు చరితను అభినందనలు:** పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితను జయరాజ్ ఇస్పాత్ స్టీల్ కంపెనీ సీఈఓ సురేష్‌కుమార్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా గౌరు దంపతులను కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

హైకోర్టు న్యాయవాదికి సన్మానం



బాలాజిని సన్మానిస్తున్న న్యాయవాదులు

కర్నూలు(లీగల్), జూన్ 18: రాష్ట్ర హైకోర్టు న్యాయవాది వై.బాలాజిని మంగళవారం స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర హైకోర్టులో ల్యాండ్ టైటిలింగ్ యాక్టుకు వ్యతిరేకంగా ప్రజా ప్రయోజన వ్యాజ్యలు వేసి ఆ చట్టం అమలు కాకుండా నిలుపుదల చేసినందుకు పలువురు న్యాయవాదులు ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది వై.బాలాజి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసైనా కూడా తాను హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యలు వేస్తూనే ఉంటానని, ప్రభుత్వాలు ప్రజలకు అన్యాయం చేస్తూ చేసిన చట్టాలను తాను హైకోర్టులో వ్యతిరేకిస్తానని అన్నారు. త్వరలో కర్నూలుకు హైకోర్టు బెంచ్ రానున్నదన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రవికాంత్ ప్రసాద్, మాజీ అధ్యక్షుడు వై.జయరాజు, సీనియర్ న్యాయవాదులు సీవీ శ్రీనివాసులు, శ్రీవాత్సవ, నిత్య జీవన్ రాజు, చల్లా సుధాకర్ రెడ్డి, తిరుపతయ్య, ఏ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు(హాస్పిటల్), జూన్ 18: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఔట్‌సోర్సింగ్ కింద పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులకు బకాయిపడ్డ మూడు నెలల జీతాలు చెల్లించాలని కోరుతూ మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి ఏఐటీయూసీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ ఉప ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు కలిసి సమస్యను సూపరింటెండెంట్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఎస్.మునెప్ప మాట్లాడుతూ మూడు నెలలుగా సెక్యూరిటీ గార్డులకు జీతాలు లేక పిల్లల చదువుల ఫీజులు, ఇంటి అద్దెల కోసం ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కొత్తగా చేరిన సెక్యూరిటీ గార్డులకు ఈఎస్ఐ కార్డులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీనిపై స్పందించిన సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి కాంట్రాక్టరు మూడు నెలల వేతనాలు వేయించేలా ఏడీ రమేష్ బాబును ఆదేశించారు.

హుశేనాపురం సొసైటీ అధ్యక్షుడి రాజీనామా

ఓర్వకల్లు, జూన్ 18: మండలంలోని హుశేనాపురం గ్రామ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు నాగతిరుపాలు తన పదవికి రాజీనామా చేసినట్లు సీఈవో మాలిక్‌బాషా మంగళవారం తెలిపారు. అనివార్య కారణాలతో రాజీనామా చేసినట్లు నాగతిరుపాలు రాజీనామ పత్రంలో పేర్కొన్నారు. రాజీనామా పత్రాన్ని జిల్లా అధికారులకు పంపినట్లు సీఈవో తెలిపారు.

నోటి క్యాన్సర్‌ను ముందుగా గుర్తించాలి

జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ హేమలత

కర్నూలు(హాస్పిటల్), జూన్ 18: నోటి క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించ కపోతే అది శరీరంలోని ఇతర భాగాలకు సైతం వ్యాపిస్తుందని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ ఐ.హేమలత హెచ్చరించారు. మంగళవారం స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన రెండో క్యాన్సర్ స్కీనింగ్ శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజూషా మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ హ్యూమన్ పాపిల్లోమా వైరస్‌తో వస్తుందని, ఈ వైరస్ సోకిన 10 నుంచి 15 సంవత్సరాల తర్వాత క్యాన్సర్‌గా మారుతుందని అన్నారు. 9 నుంచి 14 సంవత్సరాల వయస్సులో హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇస్తే క్యాన్సర్‌ను నివారించవచ్చునని అన్నారు. 30 సంవత్సరాలు దాటిన మహిళలు ప్రతి సంవత్సరం పాప్‌స్మియర్ టెస్టు చేయించుకోవాలన్నారు. కౌమార బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయడం వల్ల 70 నుంచి 80 శాతం వరకు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌ను రాకుండా అడ్డుకోవచ్చన్నారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ప్రారంభంలో ఎలాంటి లక్షణాలు కనిపించవని, లోలోపల అది విస్తరించి ప్రాణాలు తీస్తుందన్నారు. కార్యక్రమంలో స్త్రీ వ్యాధి నిపుణురాలు డాక్టర్ సాహిత్య జయరాం, డాక్టర్ రజిత, డెంటల్ ప్రివెంటివ్ అంకాలజి నోడల్ ఆఫీసర్ డాక్టర్ తులసీబాయి, డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హేమలత

తుగ్గలి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 18: తుగ్గలి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప కోరారు. మంగళ వారం టీఎస్ఎఫ్ నాయకులు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చంద్రప్ప మాట్లాడుతూ తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకుండా గత వైసీపీ అధికార రాజకీయ పార్టీ నాయకులు అడ్డుకున్నారన్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో కేంద్ర కరువు బృందం కర్నూలు జిల్లాకు పర్యటన నేపథ్యంలో తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేందుకు తన వంతు కృషి చేయాలని ఎంపీని కోరారు. కార్యక్రమంలో మధుకృష్ణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ నాగరాజును సన్మానిస్తున్న టీఎస్ఎఫ్ నాయకులు

పల్లాకు అభినందనలు

కర్నూలు(అర్బన్), జూన్ 18: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు నియామకం పట్ల జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అభినందనలు తెలిపారు. మంగళవారం రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు, బీసీ సంఘాల నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా బీసీలకు ప్రాధాన్యత కల్పించారని కొనియాడారు. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ బీసీలలో ఎందరో నాయకులను తయారు చేసి, వారి ద్వారా సేవలు అందించి రాజకీయంగా, ఆర్థికంగా ఎదుగుదలకు చంద్రబాబు సహకరించారని కొనియాడారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత పటిష్టంగా తయారు చేయడంలో చేయగల సత్తా ఉన్న నాయకుడని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు షేక్ షావలీ, బేత క్రిష్ణ, ఎస్. ముంతాజ్, సత్రం రామక్రిష్ణుడు, పి. రవికుమార్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 18: జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యజమాన్యాలు ఒక బ్రాంచికి అనుమతి తీసుకుని మరో చోట పాఠశాలలు నిర్వహిస్తున్నారని, ఈ పాఠశాలలపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌కు డీఎస్ఎఫ్, ఎస్ఎస్ఏ నాయకులు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మహేంద్రనాయుడు, ఎస్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా పాఠశాలలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అలాగే పాఠశాలల ప్రాంగణాల్లో విద్యార్థుల ఫీజుల వివరాల పట్టికను నోటీసు బోర్డులో ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మధుకుమార్, దివాకర్ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

గూడూరు, జూన్ 18: మలేరియా, డెంగీ, మెదడువాపు తదితర వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి నూకరాజు అన్నారు. మంగళవారం గూడూరు నగర పంచాయతీలో దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు నిల్వ ఉండే ప్రదేశాలు, కాలువలు, ఇంటిలో నీరు నిలువ చేసుకోనే వాటర్ ట్యాంక్‌లు వంటి వాటిలో దోమలు పెరగ కుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ జె వెంకటేశ్వర్లు, కమిషనర్ దివాకర్ రెడ్డి, డాక్టర్ షఫీయా, ఏఈ వైష్ణవి, హెచ్ఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నూకరాజు

'కూరగాయల ధరలను నియంత్రించాలి'

కర్నూలు(కల్చరల్), జూన్ 18: కర్నూలు నగరంలో కూరగాయల ధరలు కొండెక్కాయని, పేద, మధ్యతరగతి కుటుంబాల వారు వాటిని కొని తినలేని పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం వెంటనే ధరలు నియంత్రించాలని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత అన్నారు. మంగళవారం నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో ఆమె స్థానికులతో కలిసి, కూరగాయల ధరల పట్టికల్ల కార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాబు, బోయ నాగన్న, ఖాదర్‌బాషా, పార్వతి, నారాయణమ్మ, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలి

కర్నూలు(అర్బన్), జూన్ 18: వృత్తి విద్యలో టీసీసీ డ్రాయింగ్ కోర్సు చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు నగరంలోని వృత్తి విద్యాకోర్సు డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా రెగ్యులర్ పోస్టులు ఇవ్వడం లేదని, అంతకు ముందు ఉన్న డ్రాయింగ్ పోస్టులను డిప్యూటీ ఎంఈవో పోస్టులుగా మార్చారని, దాంతో డ్రాయింగ్ పోస్టులను రద్దు చేశారని, మళ్లీవాటిని పునరుద్ధరించాలని కోరారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి: వైసీపీ ప్రభుత్వం టీడీపీ నాయకులు, కార్యక ర్తలపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని బీసీ, ఎస్సీ, ఎసీ, ఓబీసీ, ఎంబీసీ కులాల హక్కుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు టీజీ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, రక్షణ, శాంతి భద్రతలు, భారీ నీటి పారుదల ప్రాజెక్టులు, రోడ్లు, ల్యాండ్, ఇసుక, మైనింగ్ పాటు రాష్ట్రంలో ఉన్న సమస్యలన్నింటిపై దృష్టి సారించి మంచి పాలన సాగించాలని అకాంక్షించారు.

సుంకులమ్మకు బోనాలు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 18: నగరంలోని సాయిబాబా సంజీవ్‌నగర్ కాలనీ వాసులు సుంకులమ్మకు సమర్పించారు. మంగళవారం ఇళ్లలో నుంచి మహిళలు అమ్మవారికి ప్రసాదం చేసుకుని బోనాలతో ఆలయం వద్దకు వెళ్లారు. మేళతాళాలతో మహిళలు ఆలయానికి వెళ్లి అమ్మవారికి మొక్కుతీర్చుకున్నారు. వర్షాలు బాగా కురవాలని, పంటలు పండి రైతులు సిరిసంపదలతో అభివృద్ధి చెందాలని కోరుతూ అమ్మవారికి బోనాలు సమర్పించారు.

'గో హంతకులపై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న నందిరెడ్డి సాయిరెడ్డి

కర్నూలు(కల్చరల్), జూన్ 18: హిందువులు దైవంగా భావించే గోమాతలను అక్రమంగా తరలిస్తూ, వధిస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీయాలని చూస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని కేసీ కెనాల్ సమీపంలోని వినాయక మందిరం సమావేశ హాలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతినిత్యం గోవధ జరుగుతున్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో అత్యధికంగా గోవధ జరిగే అవకాశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం నివారించలేకపోతున్నదని అన్నారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా, నగర అధ్యక్షుడు గోరంట్ల రమణ, టీసీ మద్దిలేటి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాళిగి భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్ తనిఖీ

ఓర్వకల్లు, జూన్ 18: ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఎస్పీ జి.కృష్ణకాంత్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో పోలీసులు పర్యటిస్తూ ఉండాలని, అక్కడి పరిస్థితుల గురించి, సమస్యల గురించి ఎప్పటికప్పుడు ఆరా తీసి తెలుసుకోవాలన్నారు. ఎలాంటి గొడవలకు ఆస్కారం ఇవ్వద్దన్నారు. సమస్యలపై బాధితులు పోలీస్‌స్టేషన్‌కు ఆశ్రయించినప్పుడు మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల విధుల్లో ఎక్కడా కూడా ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బాగా పని చేశారని అభినందించారు. ఆయన వెంట ఓర్వకల్లు ఎస్ఐ రాజారెడ్డి ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

జూన్ 20ని రెవెన్యూ డేగా ప్రకటించాలి

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 18: జూన్ 20ని రెవెన్యూ డేగా ప్రకటించాలని కోరుతూ ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు గిరికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళ వారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గిరికుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 20వ తేదీ రెవెన్యూ డేగా నిర్వహించుకునేందుకు ప్రభుత్వం జీవో 81 ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. కార్యక్రమంలో నాగరాజు, వెంకట రాజు, వేణుగోపాల్‌రావు, సుధాకర్, కృష్ణుడు, సునీల్ కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

సి.బెళగల్, జూన్ 18: బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని జిల్లా సమగ్ర శిక్షణ కో-ఆర్డినేటర్ విజయజ్యోతి కుమారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో విద్యార్థులకు వచ్చిన పార్య పుస్తకాలను ఆమె పరిశీలించారు. ఆమె వెంట ఎంఈవో ఆదాంబాషా, సీఆర్‌పీలు ఉన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 18: ఒలంపిక్ డే రన్ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అంతర్ పాఠశాల బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా ఒలింపిక్ అసోసి యేషన్ అధ్యక్షుడు బి.రామబాంజనేయులు కలిసి బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభించారు. విజేతలకు స్వర్ణ, రజిత కాంస్య పథకాలతోపాటు ప్రతిభా పురస్కారాలను అందజేస్తామని తెలిపారు. జిల్లా హాకీ అసోసి యేషన్ కార్యదర్శి దాసరి సుధీర్, సాఫ్ట్‌బాల్ టి.గంగాధర్, ప్రతినిధులు ప్రతాప్, ఆలి, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి: సీపీఎం

ఓర్వకల్లు, జూన్ 18: రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. మంగళవారం రైతు సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం మండల నాయకులు మధుసూదన్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా నాగన్న, మండల అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ గత మూడేళ్లుగా అతివృష్టి, అనావృష్టితో రైతులు వేసిన పంటలకు దిగుబడి రాక, గిట్టుబాటు ధర లేక అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ, చాంద్‌బాషా, నాగరాజు, మల్లేష్, మాసూంబాషా, జగన్నాథం, రామాంజనేయులు పాల్గొన్నారు.

పొదుపు మహిళల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 18: పొదుపు గ్రూప్ మహిళల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యకు పొదుపు మహిళలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీ.క్యాంపు రైతుబజారు పొదుపు గ్రూపు మహిళలు మాట్లాడుతూ రైతుబజార్ ఎస్టేట్ అధికారి జూన్ నెల నుంచి రూ.180 నుంచి రూ.200లు పెంచుతూ ఆదేశాలు జారీ చేశారు. రోజూ అద్దె కాకుండా ప్రతి నెలకు ఒకసారి రూ.6వేలు చెల్లించాలని అధికారులు తమపై ఒత్తిడి తెస్తున్నారని అన్నారు. ప్రతి సంవత్సరం కాకుండా మూడు లేదా 5 సంవత్సరాలకు ఒకసారి రూ.100లకి 11.11 శాతం పెంచాలని మార్కెటింగ్ అధికారి, రైతుబజారు అధికారులను కోరుతున్నామని జేసికి వివరించారు. కార్యక్రమంలో పొదుపు మహిళలు ఝాన్సీ, శాంతి, విజయలక్ష్మి, నీరజ, ధనలక్ష్మి, సింధూర పాల్గొన్నారు.

మౌలాలి కుటుంబానికి పరామర్శ

కర్నూలు(న్యూసిటీ), జూన్ 18: నగరంలోని బిర్లాగడ్డలో నివాసం ఉంటున్న హమాలీ ఎం.మౌలాలి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. మంగళవారం సీఐటీయూ నగర అధ్యక్షుడు ఆర్.నరసింహులు, కార్యదర్శి సీహెచ్ సాయిబాబా మౌలాలి కుటుంబాన్ని పరామర్శించారు. నరసింహులు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా బిర్లాగడ్డ హమాలీ యూనియన్ నాయకుడిగా ఆయన పని చేశారని అన్నారు. ప్రభుత్వం మౌలాలీ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, మదు, భాష, నాగన్న పాల్గొన్నారు.

'బీజేపీకి వైసీపీ మద్దతు అవసరం'

కర్నూలు(న్యూసిటీ), జూన్ 18: పార్లమెంటులో ఎన్‌డీఏ ప్రవేశపెట్టే బిల్లులకు వైసీపీ మద్దతు అవసరమని 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి అన్నారు. మంగళవారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండియా కూటమి ఎన్డీఏ కూటమిపై అవిశ్వాస తీర్మానం వైసీపీ అవసరం కేంద్రానికి ఉంటుందన్నారు. రాజ్యసభ 11, లోక్‌సభ 4 సీట్లు వైసీపీకి ఉన్నాయన్నారు.

వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 18: నగరంలోని గౌరిగోపాల్ సమీపంలో నగర పాలక సంస్థ చేపట్టిన నిర్మాణంపై వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని ఏపీ వాల్మీకి బోయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లార్తి అర్జున్ వాల్మీకి అన్నారు. మంగళవారం నగర పాలక సంస్థ చేపట్టిన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు.

ఎంపీఈవోలు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో

సి.బెళగల్, జూన్ 18: మండలంలోని ఎంపీఈవోలు రైతులకు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ఎంఈవోలు అందుబాటులో లేరని రైతులు ఫిర్యాదు చేస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సి.బెళగల్‌లోని సీడ్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈసమావేశంలో ఎంపీ ఈవోలు సిద్దు, చెంచురాజు, నాగన్న, వెంకటేష్, ఈశ్వర్ పాల్గొన్నారు.

రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఆదోని (అగ్రికల్చర్)జూన్ 18: పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన రజక విద్యార్థులకు మంగళవారం ప్రతిభా పురస్కారాలను అందజేశారు. పేట వీరభద్ర స్వామి దేవాలయంలో రజక ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అతిథులుగా జిల్లా అధ్యక్షుడు నరసింహ రాజు, రిటైర్డ్ ఏఎస్‌డబ్ల్యూవో గోవిందప్ప, నాగరాజు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గత 13 ఏళ్లుగా రజక విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకు ప్రతిభ పురస్కారాలను అందజేస్తున్నామన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా రాణించాలని సూచించారు. రజక సంఘం నాయకులు సతీష్, రామన్న, కిషోర్, కౌన్సిలర్ నాగలక్ష్మి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సావిత్రి పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి : పార్థసారధి

ఆదోని, జూన్ 18: ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి అన్నారు. గురువారం ఆదోని పట్టణం ఆర్ఆర్ లేబర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగ్, షూస్, యూనిఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి దశలోనే భవిష్యత్తు ప్రణాళికను సిద్ధం చేసుకుని ఉన్నత లక్ష్యాన్ని సాధించాలని కోరారు. అనంతరం పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు షీల్డ్, బహుమతులు అందజేశారు. జనసేన నాయకుడుమల్లప్ప, హెచ్ఎమ్ రమేష్ నాయుడు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలు ఐదురోజులకు పెంచాలి

పత్తికొండ టౌన్, జూన్ 18: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన పత్తికొండలో వినాయక చవితి ఉత్సవాలను ఐదు రోజులకు పెంచాలని బీజేపీ, బీజేవైఎం, విశ్వహిదూ పరిషత్, ఉత్సవ కమిటి సభ్యులు అధికారులను కోరారు. మంగళవారం ఆర్డీవో, స్థానిక సీఐ మురళిమోహన్‌కు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కమిటీ సభ్యులు లింగమయ్య, బీటీ పవన్, నవీన్, సుదాకర్, కరణంనరేష్, గోవర్దన్ నాయుడు, బ్రహ్మయ్య, వీరాజు తదితరులు పాల్గొన్నారు.

దహనవాటిక నిర్మాణంలో రూ.1.30 లక్షల దుర్వినియోగం

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 18: హిందూ స్మశాన వాటికలోని దహనవాటిక నిర్మాణ పనుల్లో రూ.1.30 కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయని కేజీబీఎస్ రాష్ట్ర కన్వీనర్ ఎండీ ఆనంద్ బాబు ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని హిందూ స్మశాన వాటిక కాటికాపరి, గుంతలు తీసే వేగారుల సంఘం ఆధ్వర్యంలో స్మశాన వాటికను పరిశీలించారు.

ఆటో బోల్తా మహిళలకు గాయాలు

చిప్పగిరి, జూన్ 18: చిప్పగిరి పెట్రోల్ బంక్ వద్ద ఆటో బోల్తా పడిన సంఘటనలో ఖాజా, బన్నీ రమీజా అనే ఇద్దరు మహిళలు గాయపడ్డారు. బక్రీద్ పండుగ సందర్భంగా మంగళవారం వీరు చిప్పగిరి దర్గాలను దర్శించుకొని తిరిగి గుంతకల్‌కు వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. స్థానికులు వీరిని గుంతకల్ ఆసుపత్రికి తరలించారు. మహిళలిద్దరూ ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.

దివ్యాంగుల పాలాభిషేకం

క్రిష్ణగిరి, జూన్ 18: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు చిత్రపటాలకు దివ్యాంగుల మండల సమాఖ్య నాయకులు మంగళవారం పాలాభిషేకం చేశారు. దివ్యాంగుల పెన్షన్ 3వేల నుంచి 6 వేలకు, తీవ్ర వైకల్యం కలిగిన వారికి 10వేలు, 15వేల రూపాయలు పెంచి,జూలై నెల పెన్షన్ పంపిణీకి ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ దివ్యాంగుల జీవితాలలో చంద్రబాబు వెలుగులు నింపారని అన్నారు. దివ్యాంగుల కుటుంబాలు ముఖ్యమంత్రి చంద్రబాబును జీవితాంతం గుర్తించు కుంటాయని కృతజ్ఞతలు తెలియజేసారు. రాజేంద్ర, ఈశ్వరయ్య, గిడ్డయ్య గౌడ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



కాడెద్దుగా రైతు..

యావత్ మానవాళికి గింజలు అందించే అన్నదాతల కష్టాలు మామూలువి కావు. పంట పండించే విషయంలో చిన్న, సన్నకారు రైతన్నల పరిస్థితి ఎప్పుడూ ఆందోళనకరంగానే ఉంటుంది. ఎప్పుడు వర్షాలు పడతాయో, ఆ సమయానికి పంట పెట్టుబడి ఎలా సమకూర్చుకోవాలో తెలియక సతమతమవుతుంటారు. ఆదోని మండలం కుప్పగల్లు గ్రామానికి చెందిన తిమ్మప్ప, మారమ్మ దంపతులకు ఎకరా 15 సెంట్లు పొలం ఉంది. 15 రోజుల క్రితం కురిసిన వర్షాలకు పత్తి పంటను సాగు చేశాడు. అప్పటి నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో కలప మొక్కలు అధికంగా పెరిగిపోయాయి. ఎద్దుల గెలిమితో గుంటుక ద్వారా కలప మొక్కలను తొలగిద్దామంటే 1500 రూపాయలు ఖర్చు అవుతుండడంతో చేసేది లేక భర్త తిమ్మప్ప కాడెద్దుగా మారగా భార్య మారెమ్మ మాత్రం దించే సహాయంతో కలప మొక్కలను దున్ని తొలగించారు. ఒక రోజంతా ఎకరా పొలాన్ని దున్నినట్లు వారు తెలిపారు.

ఆదోని

నేడు ఆలూరుకు కరువు బృందం రాక

- నష్టపోయిన పంటల పరిశీలన
- కరువు రైతులను ఆదుకోవాలి
- అధికారులను కలిసేందుకు రైతులు తరలి రావాలి
- తెలుగు రైతు కమిటీ పిలుపు
- మద్దికెరలో బృందం పర్యటన రద్దు

ఆలూరు, జూన్ 18: ఆలూరు మండలంలో బుధవారం కేంద్ర కరువు బృందం అధికారులు పర్యటిస్తారని మండల వ్యవసాయ అధికారి వేంకటేశ్వర గౌడ్, తహసీల్దార్ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. గత ఏడాది 2023-24 రబీ సీజన్‌లో తీవ్ర వర్షభావ పరిస్థితుల కారణంగా పంటలు నష్టపోయిన రైతులతో హత్తిబెళగల్ రోడ్డులోని రైతు భరోసా కేంద్రంలో రైతులతో ముఖాముఖి మాట్లాడి అనంతరం పంటలను పరిశీలిస్తారని తెలిపారు.

కరువు రైతులను ఆదుకోవాలి

గత రబీ సీజన్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పంటలు నష్టపోయిన రైతులను కేంద్ర కరువు బృందం పరిశీలించి ఆదుకోవాలని తెలుగు రైతు కమిటీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి నారాయణ రెడ్డి కోరారు. మంగళవారం ఆయన ఆలూరు వ్యవసాయ అధికారులను కలిశారు. కేంద్ర కరువు బృందం సభ్యులు నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. రైతులు కరువు బృందం సభ్యులను కలిసి విన్నవించేందుకు బుదవారం ఆలూరుకు తరలిరావాలని కోరారు.

మద్దికెరలో బృందం పర్యటన రద్దు

మద్దికెర : మండలంలో ఈ నెల 19వ తేదీన పర్యటించనున్న కేంద్రం కరువు బృంధం పర్యటన రద్దయినట్లు వ్యవసాయ శాఖ మండల అధికారి ఉప్పర రవి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర బృందం మండలంలో కంది పంట పరిశీలించేందుకు వస్తోందని, అయితే, మద్దికెర మండలాన్ని రద్దు చేసి ఇతర మండలాల్లో పర్యటిస్తుందని బృందం అధికారులు తెలిపారని పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి చర్యలు

- రైతులు, వ్యాపారులకు ఉపయోగపడేలా చర్యలు
- కోల్డ్ స్టోరేజి గోడౌన్ ఏర్పాటుకు కృషి
- ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



మార్కెట్ కమిటీలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, జూన్18: ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ మార్కెట్ కమిటీని నిర్వీర్యం చేశారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం వ్యవసాయ మార్కెట్ కమిటీలో కమిటీ పర్సన్ ఇన్‌చార్జి, కార్యదర్శి పద్మావతి, సిబ్బందితో రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో ఆదాయ, వ్యయాలు, సిబ్బంది రైతులకు అందుతున్న సౌకర్యాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో మార్కెట్ కమిటీలో అభివృద్ధి జరిగిందేమిలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పత్తికొనుగోళ్లను ప్రారంభించడంతో పాటు మార్కెట్‌కు ఆదాయం వచ్చే చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే రైతులు తాముపండించిన పంటలను మార్కెట్‌కు తరలించి సులభతరంగా అమ్మకాలు సాగించేందుకు అనువైన చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. అయితే, ఈ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో వాటన్నింటిని తుంగలో తొక్కి అభివృద్ధికి ఎలాంటి నిధులు విడుదల చేసిన దాఖలాలులేవని విమర్శించారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు ఇచ్చిన హామీ మేరకు అన్ని నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. స్థానికంగా మార్కెట్ కమిటీలో కోల్డ్ స్టోరేజి గోడౌన్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. పత్తికొనుగోళ్లను కూడా పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 23ఎకరాలు ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ రైతులకు, స్థానిక వ్యాపారుల లావాదేవీలకు గతం మాదిరి ఇబ్బందిగా లేకుండా సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో తారకరామ కూరగాయల మార్కెట్‌ను అభివృద్ధి చేసి అందరు ఒకేచోట వ్యాపారాలు చేసుకునేలా చర్యలు చేపడతామన్నారు. రైతు బజార్ ఏర్పాటు పెండింగ్‌లో ఉందని ఓ విలేకరి ప్రశ్నించగా ఎమ్మెల్యే స్పందిస్తూ గత వైసీపీ ప్రభుత్వం అన్ని అభివృద్ధి కార్యక్రమాలను విస్మరించడం వల్ల నిలిచిపోయాయన్నారు. దీనిపై కూడా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో బీవీ

మంత్రాలయం : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి మంగళవారం రాత్రి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మహాముఖ ద్వారం వద్ద మఠ మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనం గా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘ వేంద్ర స్వామి మూల బృందావనంకు విశేష పూజలు చేశారు.

చంద్రబాబు చిత్ర పటానికి న్యాయవాదుల క్షీరాభిషేకం



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న న్యాయవాదులు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 18 : పట్టణంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్ర పటానికి న్యాయవాదులు క్షీరాభిషేకం చేశారు.. మంగళవారం టీడీపీ న్యాయవాదుల విభాగం ఆధ్వర్యంలో స్థానిక సోమప్ప సర్కిల్‌లో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు ఈ సందర్భంగా రామకృష్ణ నాయుడు, రషీద్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగన్ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రజలకు తీరని నష్టం తెచ్చిందన్నారు. అలాంటి యాక్ట్‌ను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎంగా బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే రెండవ సంతకం చేసి రద్దు చేశారని హర్షం వ్యక్తం చేశారు.

అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు సన్నాహాలు



అన్నా క్యాంటీన్ ఏర్పాటు కోసం తరలిస్తున్న సచివాలయ ఫర్నిచర్

ఆదోని టౌన్, జూన్ 18: పట్టణంలో అన్నా క్యాంటీన్‌లను వంద రోజులలో ఏర్పాటు చేయాలని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఆదేశాలు అందడంతో మంగళవారం అధికారులు చర్యలు ప్రారంభించారు. టీడీపీ హయాంలో 26,27,33 వార్డులలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌లలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే క్యాంటీన్‌లను రద్దు చేసి, ఆ భవనాలలో సచివాలయాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తిరిగి క్యాంటీన్‌ల ఏర్పాటు కోసం అధికారులు ఆయా సచివాలయాలను ఖాళీ చేయించి, వాటి ఫర్నీచర్‌ను తాత్కాలికంగా వేరే చోటకు తరలించారు. త్వరలో మూడు చోట్ల అన్నా క్యాంటీన్‌ల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి త్వరితగతిన ప్రారంభిస్తామని మునిసిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి తెలిపారు.

జీడీపీలో పర్యాటకుల సందడి



గాజులదిన్నె ప్రాజెక్టు నీటిలో పర్యాటకుల సందడి

గోనెగండ్ల, జూన్ 18: బక్రీద్ పండగను పురష్కరించుకొని ముస్లింలు కుటుంబ సభ్యులతో కలిసి పెద్దఎత్తున గాజులదిన్నె ప్రాజెక్టును సందర్శించి సందడి చేశారు. గతంలో పర్యాటక కేంద్రంగా ఉండటంతో ఈ పండుగ సందర్భంగా ఎమ్మిగనూరు, కోడుమూరు, దేవనకొండ, గోనెగండ్ల తదితర ప్రాంతాల నుంచి సొంతవాహనాల్లో మహిళలు, పిల్లలు, యువకులు తరలి వచ్చారు. పండుగ సందర్భంగా చేసిన వంటకాలను బంధువులు, స్నేహితులతో కలిసి భోజనం చేసి ప్రాజెక్టు నీటిలో జలక్రీడలాడారు. సాయంత్రం సొంత గ్రామాలకు బయలు దేరారు. ఉదయం నుంచి ప్రాజెక్టు ప్రాంతం సందడిగా మారిపోయింది.

నేరణికి తండాను సందర్శించిన డీఎంహెచ్‌వో



తండావాసులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రవీణ్ కుమార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హొళగుంద, జూన్ 18: హొళగుంద మండలం నేరణికి తండాలో వాంతులు, విరేచనాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఆంధ్రజ్యోతిలో ఈ నెల 17న "కలుషితం నీరు ప్రాణం తీసింది" అనే శీర్షిక ప్రచురితం కావడంతో కర్నూలు డీఎంహెచ్‌వో ప్రవీణ్ కుమార్, ఆదోని డీఎల్‌పీవో నూర్ జహాన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య, ఈవోఆర్డీ చంద్రమౌలీశ్వర్ గౌడ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామ్‌నీలా నాయక్ స్పందించారు. మంగళవారం నేరణికి తండాలో పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు. నీరు కలుషితం కావడం వల్లే కొందరికి వాంతులు, విరేచనాలు అయినట్లు నిర్ధారించారు. విరుపాపురం నుంచి తండాకు నీరు సరఫరా అయ్యే తాగునీటి పైప్ లీకేజీని గుర్తించి, హుటాహుటిన మారమ్మతులు చేపట్టారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. నీటిని వేడి చేసుకొని తాగాలని ప్రజలకు సూచించారు. అధికారుల వెంట డాక్టర్ న్యూటన్, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ షఫీ పాల్గొన్నారు.

ధణాపురంలో ఆకస్మిక తనిఖీ

ఆదోని రూరల్ : డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రవీణ్ కుమార్ ఆదోని మండలం ధణాపురంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందితో సమావేశమై రికార్డులను తనిఖీ చేసి 104 విధి విధానాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. వైద్యులు ఇబ్రహీం, ఎంపీహెచ్‌ఈఓ ఉమాపతి, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రమోహన్ ఆయన వెంట ఉన్నారు.

వైసీపీ నుంచి 80 కుటుంబాలు టీడీపీలో చేరిక



మీనాక్షినాయుడు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నాయకులు

ఆదోని, జూన్ 18: మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు మీనాక్షినాయుడు సమక్షంలో వైసీపీ నుంచి 80 కుటుంబాలు టీడీపీలో చేరారు. మంగళవారం మీనాక్షినాయుడు స్వగృహంలో మాజీ కౌన్సిలర్ తిమ్మప్ప ఆధ్వర్యంలో 60 కుటుంబాలు, అడ్వకేట్ ఐసీ రామకృష్ణ, వలి ఆధ్వర్యంలో ఇందిరానగర్ నుంచి 20 కుటుంబాలు టీడీపీలోకి చేరారు.

పంచాయతీ భవనంలో సీఎం డిప్యూటీ సీఎం ఫొటోలు



సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు ఏర్పాటు చేసిన దృశ్యం

మద్దికెర, జూన్ 18: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. వారు ప్రమాణ స్వీకారం చేసి ఐదు రోజులైనప్పటికీ కార్యాలయాల్లో వారి చిత్రపటాలు ఏర్పాటు చేయకపోవడంతో టీడీపీ పంచాయతీ సభ్యులు ఎస్.లక్ష్మినారాయణ, ఈడిగ చంద్రశేఖర్‌గౌడు, ఉప్పర రవిలు పంచాయతీ సమావేశ భవనంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి, పంచాయితీ సభ్యులు ఉన్నారు.

అనితకు హోంశాఖ కేటాయించడం హర్షనీయం

పెద్దకడుబూరు, జూన్ 18: రాష్ట్ర తెలుగు మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనితకి హోంశాఖ కేటాయించడం హర్షించదగ్గ విషయమని జిల్లా తెలుగు మహిళ అధికార ప్రతినిధి నరవ శశిరేఖ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన పెద్దకడబురులోని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనిత సారథ్యంలో ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శాంతిభద్రతలు కాపాడి.. గంజాయి లాంటి మత్తు పదార్థాలు రాష్ట్రంలో నామరూపాలు లేకుండా చేస్తారని పూర్తి నమ్మకం ఉందన్నారు. మహిళ హోమ్ మినిస్టర్ పరిపాలనలో రాష్ట్రంలోని మహిళలందరూ సురక్షితంగా, ధైర్యంగా ఉంటారని విశ్వాసం కలుగుతుందని పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

దేవనకొండ ,జూన్ 18 : గుండెపోటుతో మృతి చెందిన హోంగార్డు శ్రీనివాసులు కుటుంబానికి దేవనకొండ పోలీసులు అండగా నిలిచారు. మంగళవారం సీఐ శ్రీనివాసులు, పోలీసులు ,మహిళ పోలీసులు తమవంతుగా రూ.50 వేల ఆర్థిక సహాయం, నిత్యవసర సరుకులను హోంగార్డు కుటుంబానికి అందజేశారు. ఏఎస్సై శ్రీనివాసులు, పోలీసులు దస్తగిరి, మాజీ సర్పంచు లక్ష్మిదేవమ్మ, బడిగింజల రంగన్న పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

మద్దికెర, జూన్ 18: పత్తికొండ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని రాయలసీమ కాపు సంఘం నాయకులు వైపీ వీరన్న, జనసేన నాయకులు వై.క్రాంతి కుమార్ ఎంపీ బస్తిపాటి నాగరాజును కోరారు. మంగళవారం వారు ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

రైతుల సంక్షేమమే కూటమి ధ్యేయం

పెద్దకడుబూరు, జూన్ 18: మహారాష్ట్రలో 17వ విడత పీఎం రైతు కిసాన్ నిధులు రూ.20 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాలో జమ చేయడం హర్షణీయమని తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పీఎం మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెం నాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతుల సంక్షేమమే కూటమి ధ్యేయమని పేర్కొన్నారు.

గోమాత పరిరక్షణపై కఠినంగా వ్యవహరించాలి

ఆదోని టౌన్, జూన్ 18: గోమాతల అక్రమ రవాణాతో పాటు గోవధలపై ఉన్న నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్‌తో పాటు భజరంగ్ దళ్ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం వీహెచ్‌పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. గోవుల అక్రమ రవాణాతో పాటు, వాటిని కమేలాకు తరలించడం యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోడం లేదని ఆరోపించారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని కోరారు. జిల్లా కార్యదర్శి హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

ఆదోని టౌన్, జూన్ 18: ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని టీబీ యూనిట్ విభాగంలో రోగులకు అందే ఉచిత వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని వైద్య సిబ్బంది కోరారు. మంగళవారం స్థానిక షరాఫ్ బజార్, కౌడల్ పేట ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు. ఎంపీహెచ్‌ఎస్ బాబురాజు మాట్లాడుతూ, క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. వ్యాధిపై అపోహలు ఉన్న వారికి వ్యాధి నిర్ధారణ కోసం గళ్ల పరీక్ష, రక్త పరీక్షలతో పాటు ఉచిత ఎక్స్‌రేలను తీసి తగిన వైద్య సలహాలను అందిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశం అందరూ వినియోగించుకోవాలని కోరారు.

ఆలూరు సమస్యల పై గళం విప్పుతా : ఎమ్మెల్యే విరుపాక్షి

హాలహర్వి, జూన్ 18: వెనుకబడిన ఆలూరు ప్రాంత సమస్యల పై అసెంబ్లీలో గళం విప్పుతానని ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. మంగళవారం గూళ్యం గాదిలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, రోడ్లు అధ్వాన్నంగా మారాయని పేర్కొన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

20న పంచాయతీ వేలాలు

ఆలూరు, జూన్ 18: ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ మార్కెట్‌లకు బహిరంగ వేలం పాటలు ఈ నెల 20న ఉదయం 10.30కు స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్‌డీ ప్రకాష్‌నాయుడు మంగళవారం తెలిపారు. వారపు సంతమార్కెట్, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండు, గొర్రెల వధశాల, పశువుల మాంసము, పశువల వధశాలలకు వేలం పాటలు జరుగుతాయన్నారు. జూలై 1 నుంచి 2025 మార్చి 13వ తేదీ వరకు కాల పరిమితి ఉంటుందని పేర్కొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేతకు తీర్మానం

మద్దికెర, జూన్ 18: గ్రామ పంచాయితీ స్థలాల్లో అక్రమ కట్టడాల కూల్చివేతకు సభ్యులు తీర్మానం చేశారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచు బండారు సుహాసిని అధ్యక్షతన సమావేశంలో సభ్యులు ఎస్.లక్ష్మినారాయణ, ఉషా చంద్రశేఖర్‌గౌడు, వై.రవి తీర్మానం చేశారు.